
# "రెస్టు ఏరియా కథలు
# : స్వాన్ రివర్"

- నిర్మలాదిత్య

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన ఉగాది

రచనల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ



గ్రాంట్ వుడ్ చిత్రం లాగ ఉంది అనుకున్నాను. ఎందుకుండదు. ఆ మైదానాన్ని నిలువుగా చీలుస్తున్న రోడ్డు. రోడ్డున ఇరువైపుల రకరకాల వన్నెలతో ఉన్న ప్రయరీ పువ్వులు. వాటి పక్కనే ఎకరాల కొద్దీ వేసి ఏపుగా పెరుగుతున్న మొక్కజొన్న, సోయా పంటలు. ఆ పొలాల మధ్యలో కొన్ని మైళ్ళ కొక గాదెతో పాటు ఉన్న ఫార్మ్‌హౌసు, నేను ప్రయాణిస్తున్నది గ్రాంట్‌వుడ్ పెరిగిన మిడ్ వెస్టు ప్రాంతంలోనే.

అబ్బాయి కావాలనుకొని ముగ్గురు కూతుళ్ళకు తండ్రినయ్యిపోయాను. కానీ అబ్బాయి లేడన్న లోటు లేకుండా ముగ్గురు కూతుళ్ళూ పోటీ పడి మరీ పై చదువులు చదివేసి, పెళ్ళి చేసుకుని ఈ U.S వచ్చేసారు. ఇక వాళ్ళని చూడ్డం కోసమని, వాళ్ళ పురుళ్ళకని నేను, మా ఆవిడ తరచుగా అమెరికా వస్తూనే ఉన్నాం. ఈ మధ్య రెండో కూతురు వాళ్ళు 'సిన్సినాటికి' ఉద్యోగరీత్యా మూవ్ అయ్యారు. పెద్దమ్మాయి సీడర్ రాపిడ్స్‌లో ఉంటుంది. పెద్దమ్మాయి దగ్గర ఓ రెండు నెలలున్నాక రెండో అమ్మాయి పురుడు దగ్గర పడే సరికి దానికి సహాయానికని నన్ను మా ఆవిడ్ని తీసుకుని పెద్దమ్మాయి బయలుదేరింది. అల్లుడు అమ్మాయి ముందు సీట్లలో కూర్చున్నారు. నేను మా ఆవిడ మధ్య వరుసలో కూర్చోగా చివరి వరుసలలో ఇద్దరు మనవళ్ళు కూర్చున్నారు. మా అమ్మాయికి ఇద్దరు అబ్బాయిలు. అమ్మాయి పుట్టలేదని తనకో లోటు.

మెలీన్ రావటంతో అల్లుడు I- 80 నుంచీ I- 74 కు మళ్ళించాడు వేను. ముందు కూర్చుని అల్లుడు కూతురు మా ఆవిడతో మాట్లాడుతూనే ఉన్నారు. నేను అప్పుడప్పుడు వాళ్ళ సంభాషలతో పాలుపంచుకుంటూనే ఉన్నాను. కానీ బయట కనిపిస్తున్న దృశ్యాలు నా ఆలోచనా స్రవంతిని మరింత వేగంగా ఎక్కడెక్కడో మెదడులో దాక్కున్న జ్ఞాపకాలను వెదికి పట్టుకుని ఓ వెల్లువలాగా ప్రవహింపచేస్తున్నాయి. మూడో తరగతి జాగ్రఫీలో నేర్చుకున్న ది ప్రయరీ మైదానాలివేనా? దూరము, సమయం డైరక్టు ప్రపోర్షనా లేక ఇన్వర్షనా? కారు వేగం గంటకు 70 మైళ్ళు అయితే 400ల మైళ్ళు ఎన్ని గంటలలో ప్రయాణం చేయవచ్చును? ఈ లెక్కలు ఆరో తరగతిలోనా నేర్పించింది? 'నీలిమబ్బుల నీడలోన' ఏ సిన్మాలో పాట అది? బారులగా ఆకాశంలో ఎగురుతున్న పక్షులు హంసలా, బాతులా? పిట్టల దొరంటే డిక్‌చేయినీనా? ఇదేంటి. "స్వాన్ రివర్", స్వాన్ రివర్.. స్వాన్ రివర్ చాల పరిచయమైన పేరులాగా ఉంది,

కానీ గుర్తుకు రావటం లేదేంటి? ఎక్కడ విన్నానట ఆ పేరు? నాలుక చివర్న ఉన్నట్టుంది. కానీ గుర్తుకు రావటం లేదేంటి? ఎక్కడ విన్నానట ఆ పేరు? నాలుక చివర్న ఉన్నట్టుంది. కానీ గుర్తుకు రావటం లేదు. టు...టు..టు..టు....

"నాన్నా రెస్టు ఏరియా వచ్చింది ఆగుదామా అంది. అది 'స్వాన్ రివర్' రెస్ట్ ఏరియాలోనే. ఆగితే నా మనస్సును పీడిస్తున్న ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుందని పించింది. "సరే ఆగుదామమ్మా' అన్నాను.

'ఏమండీ రెస్టు ఏరియాలోకి తీసుకోరా" అని అమ్మాయి అల్లుడికి చెప్పింది.

వేను ఆగాక పిల్లలు హడావిడిగా దిగి బయటకి పరిగెత్తసాగారు. రెస్టు ఏరియా కొంత సందడిగా ఉంది. కొంత దూరంలో ట్రక్కులు బారులు తీరి పార్కు చేయబడ్డాయి. మరో ప్రక్క, దగ్గర్లో పది కార్లు పార్కు చేసి ఉన్నాయి. మైదానంలో పల్లంగా ఉన్న చోట రెస్టు ఏరియా కట్టారు. కొంచెం పైగా ఎదురుగా రోడ్డుపైన హైవేలో కార్లు, ట్రక్కులు, వేన్లు పరుగులు తీస్తున్నాయి. పార్కు చేసిన ట్రక్కులు, కార్లకు, హైవే మధ్య ఉన్న ప్రదేశంలో లాండ్ స్కేప్ చేసిన పచ్చటి లాన్. అక్కడక్కడ పూలమొక్కలు. పార్క్ చేసిన కార్ల ఇటువైపు రెస్టు తీసుకోవాలనే వారికి ఓ పెద్ద హాలు రెస్టు రూములు, వెండింగు మిషనులు హాలు కిరువైపుల అక్కడక్కడ పార్కులో బెంచీలు, రిలాక్సు అవడానికని, కుక్కలను నడిపించడానికి కాను, చెట్ల మధ్య నుంచీ మల్పులు తిరుగుతూ వేసిన కాలిబాట. ఆ బాట అలా వెళ్ళి స్వాన్ రివర్ మీద ఓ చిన్న వంతెనతో అంతమౌతుంది. ప్రకృతి అందంలో పడి పరిసరాలు మరిచిపోయే ప్రమాదంలో పడేరు, కావలిస్తే ఆదుకోవడానికి మేమున్నాం అంటూ 911, పోలీసులను పిలవడానికి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అలారం సిస్టంలు. మనస్సుకు ఆహ్లాదకరంగా, శరీరాలకి బడలిక తీరేలాగా కట్టిన ఈ పార్కుల లాంటి రెస్టు ఏరియాలలో ఆగడం నాకు సరదానే. కానీ నా ఆలోచన చిక్కుముళ్ళలో ఇరుక్కుపోయిన "స్వాన్‌రివర్" ఆ పరిసరాలను నేను అనుకున్నంత సంతోషంగా ఉంచలేకపోతున్నాయి.

'గ్రాంపా' గ్రాంపా' అంటూ నన్ను లాక్కెళ్ళి వాళ్ళకు కావలసిన కండెలు కొనుక్కున్నారు పిల్లలిద్దరు. రెస్టుఏరియా నుంచీ అప్పుడే వచ్చిన అల్లుడు "పిల్లల్ని బాగా స్పాయిల్ చేస్తున్నారు మామయ్య" అని వాపోయాడు.

'అల్లుడు స్వాన్ రివర్ అంటే ఏమైనా గుర్తొస్తోందా' అని అడిగాను.

'అబ్బే అది ఇక్కడ పారుతున్న ఏరు పేరై ఉంటుందండి" అన్నాడు. అల్లుడు కంప్యూటర్ మీద పని చేయడంలో మేధావి అని విన్నాను. కానీ అతనికి ఇతర విషయాలపైన ఆసక్తి జ్ఞానం బొత్తిగా శూన్యం. అతనికి జవాబు తెలిస్తే ఆశ్చర్యపడేవాణ్ణే.

"ఏమండీ ఏమిటీ ఆ చూపులు. ఎక్కడో మీ ఆలోచనలు. కాఫీ ఏమైనా తీసుకుంటారా?" అంది మా ఆవిడ." అబ్బే వద్దు. ఇక్కడ చూసావా - ఈ ప్రయిరీ మైదానాలలో పెరిగే పూల బొమ్మలు, పేర్లు ఎంత బాగా ఈ పోస్టర్లో వేసారో. ." అని నేను మా ఆవిడ హాలులో తగిలించిన పోస్టర్ చూపి వాటి పేర్ల మేచ్ చేసి పూలు చూసి సాగాము." ఇది చూసావా కాశీ రత్నం పూల లాగా లేదు. దాని పేరేం అంటావు" అని నేనంటే

"ఇది చూసారా రోడ్డు ప్రక్కన కొన్ని వేల కొద్దీ పూలు పిచ్చిగా పెరుగుతున్నాయి. దీని పేరు 'బ్లాక్ సూసన్'అట" అంది మా ఆవిడ. అలా పూల పేర్లన్నీ చదివి హాలు బయటకి దారి తీసాము. అల్లుడు అమ్మాయి తలుపు దగ్గరున్న టీవీ మానిటర్‌పైన వాతావరణం అప్‌డేట్సు దాని పక్కనే పెద్ద మేపును చూస్తున్నారు. పిల్లలకోసం చూసాను. వాళ్ళు అప్పుడే బయట పార్కులోకి పరుగెత్తుతున్నారు.

పిల్లలు అలా లాన్లలో పరుగెత్తి ఆడుకుంటుంటే - నేనూ మా ఆవిడ అక్కడే ఎక్కడైనా కూర్చుందామా అని పార్కులోని బెంచీల కోసం వెదకసాగాము. చాలా ఖాళీ బెంచీలు కనిపించాయి. కుడివైపు ఓ మూల ఓ కుటుంబం బెంచీల పైన కూర్చుని ఏదో తింటున్నట్టున్నారు. సమ్మర్ కాబట్టి సాయంత్రం ఆరు అయిన ఇంకా మధ్యాహ్నం మూడు గంటల లాగానే ఉంది. ఇక్కడ అలవాటు ఆరుకంతా డిన్నర్లు చేసేస్తారు. 'స్వాన్ రివర్ రెస్టు ఏరియా' చక్కటి బోర్డు కనపడడంతో మళ్ళీ మెదడు స్వాన్ రివర్ గురించి

ఆలోచించసాగింది. ఓ చిన్న బొచ్చు కుక్కను నడిపిస్తున్న ఒకావిడ, కొంచెం పెద్దగా ఎత్తుగా ఉన్న గ్రేహౌండు కుక్కను నడిపిస్తున్న మరో పర్వతాకారానికి దూరంగా పోవడానికి ప్రయత్నిస్తున్నది.

మరో వైపు ఉన్న పార్కు బెంచీల పైన ఏదో మనవాళ్ళు కూర్చున్నట్లనిపించింది. అప్రయత్నంగా నేను మా ఆవిడ అటువైపు అడుగులు వేసాం. ఇండియాలో అస్తమానం వాళ్ళతో వీళ్ళతో మాట్లాడడానికి అలవాటుపడి ఇక్కడికి వచ్చాక రోజుల తరబడి అమ్మాయి, అల్లుళ్ళతోనే వుండటం వల్ల అవకాశం వస్తే కొత్తవారితో పరిచయం చేసి మాట్లాడుకోవడం సహజమేనేమో!

దగ్గరకు పోయి చూస్తే దాదాపు దాదాపు నా వయస్సే ఉన్న ఒకతను, వాళ్ళావిడా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఏదో పళ్ళరసం బాటిల్ లో నుంచీ త్రాగుతున్నారు. ఆయన ముఖం చాలా సుపరిచితం అనిపించింది. 'స్వాన్‌రివర్' మిస్టరీ ఆలోచనలు అక్కడ పక్కన పెట్టేసి, నా మెదడు ఎదురుగా ఉన్న ముఖాన్ని నా జ్ఞాపకాలలో దాక్కున్న అనేక ముఖ ప్రతిబింబాలతో మేచ్ చేయడానికి మెఱుపు వేగంతో మొదలు పెట్టింది. గుర్తొచ్చేసింది. అచ్చు విచ్చుమామయ్య లాగానే ఉన్నాడు. విచ్చు మామయ్య. జ్ఞాపకాలను వెదుక్కుంటూ క్షణంలో నేను ఓ 40 ఏళ్ళ వెనక్కు వెళ్ళిపోయాను. అప్పుడు నేను ఆరోతరగతి చదువుతున్నాననుకుంటా. మా పక్కింటిలోనే మాకు దూరపు బంధువులుండేవారు, మా తాతయ్యకు అన్నదమ్ముల వరసనుకుంటా. వాళ్ళకు ఓ నలుగురు అమ్మాయిలు మరో నలుగురు అబ్బాయిలు. ఎప్పుడూ ఈ అబ్బాయిలు, అమ్మాయిల వాళ్ళ కుటుంబం రాకపోకలతో ఇళ్ళు పండుగ సందడితో కళకళలాడుతూనే ఉండేది. విచ్చు మామయ్య అందరిలో చిన్నవాడు చూడటానికి బాగా ఉంటాడు కూడా. అతడు మంచి తెలివైన వాడని పై చదువులకి అమెరికాకి వెళ్ళి అక్కడే స్థిరపడిపోయాడని తెలుసు. విచ్చు మామయ్య అమెరికా నుంచీ ఇంటికి వచ్చాడంటే మా కందరికి కూడా చాక్‌లెట్లు అవి తెచ్చి ఇస్తూండటంతో విచ్చు రాకకు మా పిల్లలు కూడా తెగ ఎదురు చూసేవాళ్ళం. ఇక పక్కింటి తాత, అవ్వలు కూడా విచ్చు దూరంగా ఉన్నందువల్ల నేను వెళ్ళినప్పుడల్లా విచ్చు గురించి కబుర్లే చెబుతూ ఉండేవారు. అలాంటిది ఓసారి విచ్చు వస్తూ వస్తూ తనతోబాటు ఓ అమ్మాయిని తీసుకొచ్చాడు. అమ్మాయి విచ్చుకు తగిన జోడీయే అనిపించింది. అందంగ, సన్నగ నాజూకుగా ఉంది. తను అక్కడే విచ్చుతో బాటు 'యూనివర్సిటీ'లో చదివిందని వాళ్ళు పెళ్ళిచేసుకోబోతున్నాడని విన్నాను. కానీ విచ్చు వాళ్ళ రాక ఈసారి చిన్న సైజు దుమారం రేపింది. ఆ అమ్మాయి తమిళ అమ్మాయి. దానితో బ్రాహ్మలమ్మాయి. మన కులం కాదు అని తాత, అవ్వలు మొదట బుజ్జగించి, అటు తరువాత తోడబుట్టినవారితో చెప్పి చూచి చివరకు తిట్లు తిట్టి పంపించేసారు. విచ్చు వాళ్ళింట్లో వారి చర్యకు బాగా నొచ్చుకున్నాడు. కానీ తన నిర్ణయం మార్చుకోలేదు. తరువాత అమెరికా వెళ్ళిపోయి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడని విన్నాను.

విచ్చుని అటు తరువాత చూడలేదు. కానీ తాత అవ్వలు మా ఇంటికి వచ్చినా నేను వాళ్ళింట్లోకి వెళ్ళినా విచ్చు ప్రసక్తి రాని క్షణం లేదు. విచ్చుని తిట్టిన తిట్టు లేదు. 'ఈ ముసలితనంలో మాకు ఇంత శిక్ష వేసాడు. మమ్మల్ని ఇంత క్షోభ పెట్టి సుదూరతీరాలకి వెళ్ళిపోయాడు. వాడికీ ముసలితనం వస్తుంది. మేం పడ్డ బాధకు పదింతలు వాడు పడతాడు' అని శపిస్తూనే ఉన్నారు. చిన్నవాడవటం వల్ల విచ్చుని తిట్టినా.. వాళ్ళిద్దరికీ అపరిమితమైన ప్రేమ అనుకుంటా. అదే చివరితనంలో ద్వేషంగా మారింది. విచిత్రం ఏమంటే విచ్చు అన్నలు అక్కలు కూడా హైదరాబాదు, విజయవాడ అంటూ దూరంగానే ఉన్నా వాళ్ళు పండుగలకు సెలవుల్లో వచ్చినా ముసలివారికి వయస్సు మళ్ళి ఆరోగ్యం బాగా కృంగిపోయిన సమయంలో ఎవ్వరూ పట్టుమని ఓ పదిరోజులుండలేక పోయారు. ఉద్యోగం, పిల్లల చదువులంటూ వాళ్ళిద్దరిని ఒంటరిగానే ఉంచేసారు. అలా విచ్చు వెళ్ళిపోయిన సంవత్సరంలోనే ఆరోగ్యం బాగా చెడిపోవడం వల్ల కొద్ది నెలల తేడాతో ఇద్దరూ చనిపోయారు. విచ్చు ఆ విషయం తెలిసి దినాలకని వచ్చాడు. కానీ తనే వాళ్ళ చావుకి కారణం అయినట్లు అతని తోబుట్టువులు, చుట్టుప్రక్కల వారూ ముఖం మీదే తిట్టిపోసారు. 'నీకు నీ ముసలి తనంలో, నీ పిల్లలకోసం తపించి పోతావు' అని మూకుమ్మడిగా శపించి వేసారు. అదే విచ్చు మామయ్యని నేను చివరిసారిగా చూడటం.

విచ్చు మామయ్యలాగే ఉన్నాడితను. కానీ విచ్చు మామయ్య ఈనాటికి బాగా వయస్సు మళ్ళి ఉండాలే. ఇతను చూస్తే నాకంటే కొంచెం చిన్నవాడిలాగానే ఉన్నాడు. విచ్చుగురించి మా ఆవిడకు నేనే ఒకటి రెండుసార్లు చెప్పాను. మా అమ్మాయిలు కూడా అమెరికాలో సెటిల్ అయిన తరువాత విచ్చు విషయాన్ని గురించి మాట్లాడుకున్నాం. మా ఆవిడతో అతను విచ్చు మామయ్యలాగా ఉన్నాడు. నేను చిన్నప్పుడు చూసిన విచ్చు మామయ్య పోలికలు కొట్టిచ్చినట్లు కనిపిస్తున్నారు అన్నాను. 'హలో' అన్నాను నవ్వుతూ నేను. ఆ విచ్చు పోలికలున్నతన్ని చూసి. అతను 'హలో' అన్నాడు. పలకరింపు నవ్వుతో. వారికెదురుగా ఉన్న బెంచీలో కూర్చున్నాము.

విచ్చు పోలికలున్నాయన పక్క వాళ్ళావిడనుకుంటా షర్టు, జీన్స్‌పాంట్‌లో ఉంది. ఆవిడా నవ్వింది.

నేను మా ఆవిడ పక్కనున్న బెంచీపైన కూర్చున్నాము. "మీరు ఇండియా నుంచేనా" అన్నాను.

"అవును మా అమ్మా నాన్నలు ఇండియా నుంచీ వచ్చారు. నేను ఇక్కడే పుట్టి పెరిగాను. నా పేరు మోహన్. అతని మాటలు, చేష్టలు ఇక్కడ అమెరికన్‌లాగానే ఉంది. ఏమాత్రం మన యాస లేదు. పక్కన తన భార్యగా పరిచయం చేసిన ఆవిడ సంగతీ అంతే.

మమ్మల్ని పరిచయం చేసుకుని ఒకటీ రెండు మాటలు చెప్పి నా మనస్సులో ఉన్న సందేహాన్ని బయట పెట్టాను.

"నిన్ను చూస్తే నాకు మా మామయ్య విచ్చు గుర్తుకొస్తున్నారు. అచ్చం అలానే ఉన్నావు" అన్నాను

"విశ్వనాథా? ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు" మోహన్.

"హా అవును ఆయన పూర్తి పేరు విశ్వనాథ్ అనుకుంటా కాని నాకు విచ్చు మామయ్యే. "

"ఓ అతను మా నాన్నే. మనం బంధువులన్నమాట. నాన్న ఎలా తెలుసు మీకు"

విచ్చు గురించి నాకు తెలిసిన విషయాలు చెప్పాను. కానీ విచ్చుకు వాళ్ళ తల్లితండ్రులకు జరిగిన గొడవల గురించి చెప్పలేదు. విచ్చు వాళ్ళమ్మా, నాన్న విచ్చు కూడా ముసలి తనంలో అతని పిల్లలకు దూరం అయ్యి, బాధపడి మరీ కృంగి నశించాలి అని శపించిన సంగతి చెప్పలేదు. మోహన్ వాళ్ళావిడను చూస్తూనే మంచి అభిప్రాయం కలిగింది. మోహన్ కన్సల్టింగ్, వాళ్ళావిడ డాక్టర్ అని విన్నాను. ఇద్దరి ముఖంలో ప్రసన్నత, మంచితనం ప్రస్ఫుటిస్తున్నాయి. వారెలాంటి వారైనా ఆ విషయం చర్చించడం అనవసరం అనిపించింది.

"విచ్చు మామయ్య ఎలా ఉన్నాడు" అన్నాను.

"ఓ డాడీ! ఆయన పోయిన సంవత్సరమే పోయారు. ఎనభై పైనే వయసైంది కదండి" అన్నాడు. ముఖంలో ప్రసన్నత ఉన్నా విషాద ఛాయలు పులుముకున్నాయి.

"ఓ సారీ.. ఎలా పోయారు మోహన్." ఇది కొంచెం షాకింగ్‌గానే ఉంది.

"సరిగ్గా తెలియదండి. నిద్రలోనే పోయారని విన్నాను.

"మీరు దగ్గర లేరా? ఒక్కడే కొడుకన్నారు" అన్నాను.

"లేదండి, ఆయన 'ఓల్డ్‌ఏజ్‌హోం' లోనే పోయారు. "

విచ్చుమామయ్య శాపం తప్పించుకోలేక పోయారన్నమాట. మనస్సు కొంచెం చివుక్కుమంది.

'నాన్న చివరి క్షణం వరకూ సంతోషంగా, ఆక్టివ్‌గానే ఉండిపోయారండి' అన్నాడు.

కొంచెం షాక్ అయ్యాను. ఇది నేను ఓ క్షణం క్రితం అనుకున్న అంచనాలను తారుమారు చేసేసాయి. విచ్చు మామయ్య, ఆయన వలచి పెళ్ళి చేసుకున్న భార్య ఓ రెండేళ్ళ ముందువరకు ఇండిపెండెంటుగానే ఉన్నారట. వాళ్ళతో బాటు వాళ్ళకి తెలిసిన స్నేహితుల కుటుంబాలతో కలిసి ఫ్లోరిడాలో కాండో తీసుకుని అక్కడే గడిపారట. విచ్చు మామయ్య భార్య రెండేళ్ళ క్రితం పోవడంతో విచ్చు మామయ్య తనే రీసెర్చి చేసి ఓ ఓల్డ్‌ఏజ్ హోంకు మారిపోయాడు అని చెప్పాడు.

"డాడీ, ఆయన చివరి వరకు ఆక్టివ్‌గానే ఉండి ఉన్నారు" అన్నాడు.

"మీ దగ్గర ఉండాలని ప్రయత్నించలేదా" అన్నాను.

"అబ్బే తను చాలా ఇండిపెండెంట్ నేను చేసేపని టెలీకమ్యూటింగ్ చేయవచ్చు. మా పిల్లలు కాలేజీకి వెళ్ళిపోయారు మా దగ్గర ఉండండి లేకపోతే మేమే మీదగ్గర వచ్చి ఉంటాం అని చాలాసార్లు చెప్పాను. ఏదో లాంగ్‌వీకెండ్స్ చూడటం తప్పితే తన వ్యాపకాలు తనకుండేవి. మా అమ్మకు పెద్ద ఫ్రెండ్స్ సర్కిల్ ఉంది. కాబట్టి వారికి ఒంటరితనం సమస్యే లేదు. వారికి రోజులో 48 గంటలున్నా సరిపోవేమో. రిటైర్ అయిన తరువాత వారు అదో గొప్ప అవకాశంగా భావించి వారికి కావలసిన విధంగా వాళ్ళ జీవితాలను గడిపారు. మాతో పాటు 24 గంటలుండి మా జీవితంలో ఇమిడిపోవడం వారి ఉద్దేశ్యం కాదనుకుంటా."

"అంటే అచ్చు అమెరికన్ల జీవన విధానానికి అంకితం అయ్యిపోయాడన్నమాట."

"అమెరికా, ఇండియా జీవన విధానాలున్నాయనుకోండి "

"మనిషి ఎలా జీవించాలి అన్నదానికి చాలా ఆప్షన్లు ఉన్నాయి. మా నాన్న అమ్మలలాగా జీవితాన్ని ప్రేమించి అనుక్షణం ఆ అనుభవాన్ని ఆస్వాదించి ఆనందించాలనుకునే వారికి జీవితకాలం సరిపోదు. వాళ్ళకి అన్ని విషయాలపైనా ఆసక్తి. అలా వారికి జీవితమంటేనే ఓ అడ్వెంచర్, అన్వేషణ అయ్యింది. వాళ్ళలాగా ఉండగలనా అన్నదే నా సందేహం" అన్నాడు.

మోహన్ వాళ్ళావిడతో, నేను మా ఆవిడ అలా కబుర్లు చెప్పుకున్నాం. వాచీ చూసుకున్నాను. మరో అయిదు నిమిషాలు ఉన్నాయనుకుంటాను. బయలుదేరాలని అల్లుడు, అమ్మాయిని తొందర చేయడం మొదలుపెట్టాడు. ఆడుతున్న పిల్లల నుంచీ దృష్టి మళ్ళి, రెస్ట్‌ఏరియా పేరు మీద పడింది. మెటల్ ప్లెటో పైన 'స్వాన్‌రివర్' రెస్ట్‌ఏరియా అని చక్కగా అక్షరాలు ఎంబాస్ అయ్యి ఎక్కువ లాండ్స్కేప్‌తో ఇమిడిపోయాయి.

మోహన్ చూస్తే ఇక్కడ పెరిగి పెద్దవాడయ్యాడు. తెలివైనవాడే నా మదిలోను ఇంతవరకు తొలుస్తున్న సందేహాన్ని తీర్చగలడనిపించింది! స్వాన్‌రివరంటే నాకు ఎందుకో పరిచయమైన పేరనిపిస్తుంది. ఈ రెస్ట్‌ఏరియాకు రావడం ఇదే మొదటిసారి. 'నీకేమయినా స్వాన్ రివర్ గురించి తెలుసా' అన్నాను.

"ఇదో చిన్న వంక.. అంతకంటే ఏముందండి"

ప్రక్కన మా ఆవిడ. మోహన్ వాళ్ళావిడ వాళ్ళ సంభాషణలో పడిపోయారు.

"మీకు ఇంగ్లీష్ లిటరేచర్ అంటే ఇష్టమా?" మోహన్ ముఖంలో మెరుపుతో అన్నాడు.

"ఆ ఇష్టమే. తెలుగు, ఇంగ్లీషు ఏ సాహిత్యమైనా తెగ ఇష్టం. నీకు తెలుసా. నాకు సాహిత్యం పైన ఆసక్తి కలిగించింది మీనాన్నే. తన దగ్గర బోలెడన్ని పుస్తకాలుండేవి. వాటి గురించి మా పిల్లలకి చెప్పేవాడు కూడా" అన్నాను.

"అవునండి చిన్నప్పుటి నుండి మా ఇంట్లో పుస్తకాలు పిచ్చిగా ఉండేవి. ఆయన అరవై ఐదు ఏళ్ళకి రిటైరయ్యిన తరువాత ఇంగ్లీషు లిటరేచర్ పై డాక్టరేట్ చేసారు తెలుసా."

ఆశ్చర్యం వేసింది నాకు. కానీ విచ్చు మామయ్య అలాంటి వారే అనిపించింది.

"నాన్నగారి దగ్గర బోలెడన్ని పుస్తకాలు ఆ రిసర్చ్‌కని ఉండేవి. నేను నాన్న దగ్గరకి సెలవులకు వెళ్ళినప్పుడు అలా టేబుల్ మీద పడేసిన పుస్తకాలు తీసుకుని చదివేవాడ్ని. అందులో ఒకటి 'స్వాన్‌రివర్ అంథాలజీ.."

"ఎడ్గర్ మాస్టర్స్ రాశాడు కదా ఆ పుస్తకాన్ని.." మోహన్ మాటలు పూర్తి చేశాను నేను. మిస్టరీ ఒక్క క్షణంలో విడిపోయింది. పెద్ద రిలీఫ్ అనిపించింది. అందుకే ఈ పేరు ఇంత పరిచయంగా ఉంది.

"అవునండీ. ఆ పుస్తకం చదివి నేను ఆశ్చర్యపోయాను. కథ చాలా వైవిధ్యంగా ఉండి ఓ 90 ఏళ్ళ క్రితం అలాంటి ఆలోచనలతో అప్పటికే ఓ పుస్తకం వచ్చేసిందంటే నమ్మ బుద్ధి కావడంలేదు. "

మోహన్ చెప్పింది నిజమే స్పూన్‌రివర్ గ్రానులో చనిపోయిన వారి సమాధులపైన చెక్కిన పేర్లుగల 242 మంది పద్యాలతో తమ జీవిత కథలను పాఠకునికి వివరిస్తారు. చనిపోయారు కాబట్టి వారి కథలు సూటిగా నిర్మొహమాటంగా ఉంటాయి. ఆ పద్యాలలో ఒక జీవికి మరో జీవితో ఎలా బ్రతుకు ముళ్ళు పడ్డాయో తెలుస్తుంది. ఒకాత్మకు తనకు జీవితంలో కలిగిన ప్రశ్నకు మరో ఆత్మ జీవన కథలో దొరకడం, సంతోషం, దుఃఖము, మోసం, దగా, మంచితనం, గొప్పతనం, హుందాతనం అన్ని రకాల నవరసాలు గురించిన పుస్తకం అని.

మేము అలా సాహిత్యం మీద మరికొన్ని నిమిషాలు మాట్లాడుకుని అమ్మాయి అల్లుడు దూరం నుంచే చెయ్యి ఊపడంతో మోహన్ దగ్గర ఫోన్ నెంబర్లు తీసుకుని వీడ్కోలు తీసుకున్నాము.

ఈసారి అమ్మాయి డ్రైవ్ చేస్తున్నది. అల్లుడు పిల్లల దగ్గర ఆడుకోవాలని వెనక సీటుకి వచ్చేసాడు. అమ్మాయికి కంపెనీకని డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్నాను. అమ్మాయి కబుర్లు చెపుతూనే ఉంది. రెస్ట్ ఏరియాలో చీకట్లు కమ్ముకున్నాయి. రోడ్ల పక్కనున్న పూలు పిచ్చిగా పూసి గడ్డి పచ్చదనాన్ని ఊదా రంగుతో మార్చేసాయి. మధ్య మధ్యలో మేము ఉన్నామంటూ ఎరుపు, పసుపు రంగు పూలు ఏపుగా ఎదిగిన మొక్కల చివర, తండ్రి భుజాల పైన కూర్చున్న చంటిపిల్లలలాగే సంతోషంగా పలకరిస్తున్నాయి. మాకు వీటన్నిటితో సంబంధం లేనట్టు కార్లు శరవేగంతో వీటి నుండీ పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

మోహన్ ఈ ప్రాంతంలోనే సెటిల్ అయ్యాడని విన్నాను. విచ్చు మామయ్య అంత్యక్రియలు ఇక్కడే జరిగాయా? ఆయనకి ఈ ‘స్పూన్‌రివర్‘ స్మశానంలో కథలో ఉన్న 242 మందితో పాటు ఓ సమాధి కట్టించారా?.. ఇప్పుడు మాట్లాడింది మోహనా, విచ్చు మామ్మయ్యనా? లేక మోహన్‌ని మీడియంగా తీసుకుని నా మెదడులో ఇన్ని ఏళ్ళు పొదిగి ఉన్న ప్రశ్నకు విచ్చు మామయ్య సమాధానం ఇచ్చాడా? మీడియం అంటే గుర్తొచ్చింది "గోస్ట్ సినిమాలో వూఫి గోల్డ్ బర్గ్" ఎంత చక్కగా నటించింది కదూ - నా ఆలోచనా తరంగాలకి చెలియలి కట్ట లేదు....

నిర్మలాదిత్య గారి అసలు పేరు భాస్కర్ పులికల్. ఇ.ఐ.టి చెన్నై , యూనివర్సిటి ఆఫ్ సిన్‌సిన్నాటి, యూనివర్సిటి ఆఫ్ ఐయోవా లో చదువు. గతంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ లో, ప్రస్తుతం వొరైజన్ లో పనిచేస్తున్నారు . 1999 లో ఓ ఇద్దరు మిత్రులతో కలిసి **www.evaram.com** స్థాపించి ఎడిటర్ గా పని చేసారు. ఆ పత్రికలో సినీ విమర్శనలు, ఫీచర్సు, ఓ సీరియలు వ్రాసారు. ప్రభ, స్వాతి, జ్యోతి, విపుల పత్రికలలో ఓ పది దాక కథలు పడ్డాయి. 1998 లో అమెరికా వచ్చాక రెండు కథలు వ్రాసారు, రెండూ అమెరికా కథల సంకలనాలలో చోటు చేసుకున్నాయి. నిర్మల జీవిత భాగస్వామి. ఆదిత్య వారి అబ్బాయి. ఇ మెయిల్ **pulikal@gmail.com**